

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

విద్యార్థులు మొబైల్ వాడకం తగ్గించండి

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఏ స్థాయిలోని విద్యార్థులైనా సరే సోషల్ మీడియాకు వీలైనంత ఎక్కువ దూరంగా ఉండాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. మొబైల్ వాడకాన్ని తగ్గించాలని, చదువుపై ఎక్కువ దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. అప్పుడే విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోగలుగుతారని ఆయన పేర్కొన్నారు. మీర్‌పేట్‌లోని టీకేఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం రాత్రి కళాశాల 23వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. మంత్రి కోమటిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యా సంస్థల చైర్మన్ తీగల కృష్ణారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు సమయపాలన ఎంతో ముఖ్యమని.. సోషల్ మీడియా, మొబైల్ ప్రపంచంలో మునిగిపోయి విద్యాభ్యాసాన్ని నిర్లక్ష్యం చేయొద్దని హితవు పలికారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఉత్తమ విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల కార్యదర్శి తీగల హరినాథ్‌రెడ్డి, కోశాధికారి తీగల అమర్‌నాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్‌బస్తీ సమస్యల పరిష్కారానికి చర్యలు

కొత్తపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కొత్తపేట అంబేడ్కర్‌బస్తీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన బస్తీలో పర్యటించారు. బస్తీ ప్రజలు ఆయనకు సమస్యలను విన్నవించారు. ఎన్నికల ముందు ఈ బస్తీలో డ్రెయిన్ ఔట్‌లెట్ నిర్మాణం కోసం సుమారు రూ2కోట్ల నిధులు మంజూరు చేయించామని గుర్తుచేశారు. ఎన్‌టీఆర్‌నగర్ ప్రజలు వ్యతిరేకించడంతో పనులు ఆగిపోయాయని ఎమ్మెల్యే సబితారెడ్డిని సంప్రదించి, పనులు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరదనీటి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఈఈ శ్రీనివాస్‌ను కోరారు. ఆ తర్వాత జీహెచ్ఎంసీ అధికారులు బస్తీని సందర్శించారు. సమస్యలను గుర్తించారు. బస్తీవాసులు యాదగిరి, కార్తీక్, రమేష్, నారాయణ, నాయకులు మహేష్‌రెడ్డి, రాంచందర్ పాల్గొన్నారు.

మజీద్‌పూర్ మాజీ సర్పంచికి సన్మానం

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మజీద్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డిని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు సన్మానించి షీల్డ్‌ను అందజేశారు. రాచకొండ కమిషనరేట్ ఎల్బీనగర్ జోన్ పరిధిలోని మజీద్‌పూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి తన సొంత డబ్బులు రూ.3లక్షలతో 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. శనివారం ఎల్బీనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సొంత డబ్బులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించిన మాజీ సర్పంచ్‌ని సీపీ అభినందించి సన్మానించారు.

జైబాపు జైభీమ్ జైసంవిధాన్‌ను విజయవంతం చేయాలి

సరూర్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జైబాపు జైభీమ్ జైసంవిధాన్ పేరుతో త్వరలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి సూచించారు. సదరు కార్యక్రమం నిర్వహణపై చర్చించే నిమిత్తం శనివారం అల్మాస్‌గూడలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పరిపాలన సాగిస్తున్నదని, దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకుగాను పార్టీ ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ కుట్ర : కేఎల్ఆర్

ఎల్బీనగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గాంధీ, అంబేడ్కర్‌లు సూచించిన అహింస విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ అడుగులు వేస్తుంటే బీజేపీ దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి కుట్రపన్నుతున్నదని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. ఆర్‌కేపురం మార్గదర్శికాలనీలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో సరూర్‌నగర్, ఆర్‌కేపురం డివిజన్ల జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా గాంధీ, అంబేడ్కర్‌ల చిత్రపటాలకు కేఎల్ఆర్, దేప భాస్కర్‌రెడ్డి, పారిజాతానర్సింహారెడ్డి, అనితారెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, మాజీ మేయర్ చిగురింత పారిజాతానర్సింహారెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ తీగల అనితారెడ్డి, కాంగ్రెస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్, శంకర్‌యాదవ్, ఉపేందర్‌రెడ్డి, వక్కలంక శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

సుధీర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో చోటు లేదు

● టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

హయత్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచి వెళ్లిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మళ్లీ కాంగ్రెస్ పార్టీలోనికి వస్తున్నానని చెప్పు కోవడం సిగ్గుచేటని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీగౌడ్ విమర్శించారు. ఆదివారం ఎల్బీనగర్ నియోజకవర్గంలో రూ.110 కోట్లతో చేపట్టిన, చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ క్యాడర్‌ను సమాయత్తం చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం హయత్‌నగర్‌లోని త్యాగరాజనగర్‌కాలనీలోని మధుయాష్కీగౌడ్ నివాసంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని వెన్నుపోటు పొడిచిన సుధీర్‌రెడ్డికి కాంగ్రెస్‌లో చోటు లేదని అన్నారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వస్తున్న మంత్రికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలుకాలని అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో పది సంవత్సరాలలో జరగని అభివృద్ధి కేవలం 15నెలల్లో జరిగిందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల అమలు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్లు రాజశేఖర్‌రెడ్డి, సుజాతానాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ప్రకాష్‌గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సుజాతారెడ్డి పాల్గొన్నారు.

సీతారామాంజనేయస్వామికి శత కలశాభిషేకం

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని సీతారామాంజనేయస్వామి, సంతోషిమాత ఆలయంలో శ్రీరామనవమి వసంత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం సీతారామాంజనేయస్వామికి శత కలశాభిషేకం వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని దేవాలయంలో మార్చి 30వ తేదీన నుంచి శ్రీరామనవమి వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా శనివారం నిర్వహించిన శత కలశాభిషేకం కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నవీన్‌యాదవ్, లక్ష్మీనారాయణ, రమేష్, అరవింద్, రవీందర్‌రెడ్డి, నాగేందర్, రేణుకానంద్, రంగయ్యగుప్తా తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అంబేడ్కర్‌నగర్‌లో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, బీఆర్ఎస్ నేతలు



మహనీయుల విగ్రహాల వద్ద బీజేఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి



బీజేఆర్ భవన్‌లోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, టీపీసీసీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి, అనితారెడ్డి

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

జోన్ బృందం : బాబుజగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో, బాలాపూర్‌చౌరస్తాలో జరిగిన కార్యక్రమాల్లో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీజేఆర్ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, ఎల్బీనగర్‌లో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని మల్లాపూర్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, ఆయా ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు.



ఎల్బీనగర్‌లోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సామ రంగారెడ్డి



సాహెబ్‌నగర్‌లోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు



చంపాపేటలో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు భాగ్యలక్ష్మీరెడ్డి, అరుణ, నిరంజన్‌యాదవ్, సందడి సురేందర్‌రెడ్డి తదితరులు



మల్లాపూర్‌లో బీజేఆర్ జయంతి వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాతానర్సింహారెడ్డి తదితరులు



హయత్‌నగర్‌లో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



కొత్తపేటలో బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్



చంపాపేటచౌరస్తాలో బాబుజగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు



సుభాష్‌చంద్రబోస్ కాలనీలో నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్ తదితరులు

సీసీ కెమెరాల ఏర్పాటు నాగరిక సమాజ బాధ్యత

● రాచకొండ సీపీ సుధీర్‌బాబు

కొత్తపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఏర్పాటు నాగరిక సమాజానికి అత్యవసర బాధ్యతగా గుర్తించాలని రాచకొండ సీపీ జీ.సుధీర్‌బాబు వెల్లడించారు. శనివారం కామినేని చౌరస్తా సమీపంలోని తత్వ బ్యాంక్వెట్ హాల్‌లో రాచకొండ పోలీస్ ఐటీ సెల్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన 860 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్య సమాజంలో ఉన్న ప్రతీ పౌరుడూ సమాజ భద్రతకు తన వంతు సహకరించే పోలీసేనన్నారు. మనిషికి విశ్రాంతి అవసరమని, సీసీ కెమెరాలకు అవిశ్రాంతంగా పని చేసే వెసులుబాటు ఉందని గుర్తు చేశారు. చట్టాన్ని అతిక్రమించే/చట్ట వ్యతిరేకంగా, అక్రమంగా వ్యవహరించే వారిని అదుపు చేసేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు అవశ్యమయిందన్నారు. ప్రజలందరి సహాయ సహకారాలతోనే సీసీ కెమెరాల ఏర్పాటు సాధ్యమవుతోందని పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్ కింద 14కాలనీలు, 4 గ్రామాలలో ప్రజల భాగస్వామ్యంతో రెండేండ్ల యాన్యువల్ మెయింటెనెన్స్ కాంట్రాక్టు (ఏఎంసీ)తో రూ.79,32,000 వ్యయంతో 380 సీసీ కెమెరాలను అందుబాటులోకి తెచ్చారన్నారు. మరో 480 సీసీ కెమెరాలు 119 చట్ట వ్యతిరేక/హానికర కార్యకలాపాలకు అవకాశం ఉన్న సుదూర ప్రాంతాల దేవాలయాల్లో ఏర్పాటు చేశామని తెలిపారు. ఎల్బీనగర్ జోన్‌లో 6,087 సీసీ కెమెరాలు, 71,693 నేనుసైతం సీసీ టీవీ కెమెరాలు జీయోట్యాగ్‌తో పనిచేస్తున్నాయని గుర్తు చేశారు. సీసీ కెమెరాల ఉపయోగాలను వివరిస్తూ సీపీ సుధీర్‌బాబు ఇటీవల ఛేదించిన కేసులను గుర్తు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన కాలనీలు, గ్రామాల ప్రతినిధులను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో డీసీపీలు క్రైమ్స్ వి. అరవిందబాబు, ఎస్‌బీ నర్సింహారెడ్డి, ట్రాఫిక్ వీ.శ్రీనివాసులు, ఏసీపీలు ఐటీ సెల్ నరేందర్‌గౌడ్, ఎల్బీనగర్ కృష్ణయ్య, వనస్థలిపురం కాశిరెడ్డి, జోన్ పీఎస్‌ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీపీ సుధీర్‌బాబు

పేదలకు సన్నబియ్యం అందించిన ఘనత రేవంత్‌రెడ్డిదే

● ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొదటిసారి పేదలకు సన్నబియ్యం అందించిన గనత రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పథకాన్ని శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలో ఎమ్మెల్యే రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నబియ్యం పంపిణీతో ప్రతి పేదవాడి ఇంట్లో పండగ వాతావరణం నెలకొందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేస్తుందన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా స్వయం ఉపాధి కోసం రూ.3లక్షల రుణాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం డివిజన్ ఆర్డీవో అనంతరెడ్డి, డీఎస్‌వో శ్రీనివాస్‌రావు, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, సునీతరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

నేటినుంచి అష్టలక్ష్మి ఆలయంలో మహాలక్ష్మి యాగం

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రజలందరిపై లక్ష్మీకటాక్షం ఉండాలని అష్టలక్ష్మి ఆలయంలో మహాలక్ష్మి యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, చైర్మన్ సోమ సురేష్‌కుమార్‌గుప్తా చెప్పారు. ఈనెల 6(ఆదివారం) నుంచి 11 వరకు అష్టలక్ష్మి ఆలయంలో శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనాచార్యులు, త్రిదండి శ్రీరామచంద్రరామానుజజీయర్ స్వామి సంకల్పంతో వారి ప్రత్యక్ష పర్యవేక్షలో ఈ యాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి యాగం బ్రోచర్‌ను శనివారం ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి వారు ఆవిష్కరించారు. టెలిఫోన్‌కాలనీ, రామకృష్ణాపురం, అలకాపురి, గ్రీన్‌హిల్స్‌కాలనీల మీదుగా తిరిగి దేవాలయం వరకు వేలాది మంది మంగళ స్త్రీ మూర్తులు మంగళ ద్రవ్యాలు, పసుపు కుంకుమల కలశములతో శోభాయాత్ర లక్ష్మీనారాయణులకు స్వాగతనీరాజనాలు సమర్పిస్తారన్నారు. రాత్రి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మత్సంగ్రహణం, అంకురార్పణ ఉంటాయన్నారు. యాగశాలలో ప్రతి రోజు యాగాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆదివారం సాయంత్రం అష్టలక్ష్మి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభం అవుతుందని వారు చెప్పారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, వైస్ చైర్మన్ నాగమల్ల శ్రవణ్‌కుమార్, కార్యదర్శి దాచేపల్లి శ్రీనివాస్, మాజీ చైర్మన్ బందం దామోదర్‌గుప్తా పాల్గొన్నారు.



మహాలక్ష్మియాగం బ్రోచర్ విడుదల చేస్తున్న ఆలయ చైర్మన్ సోమసురేష్, వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా తదితరులు

దృష్టి మరల్చి చోరీలు చేస్తున్న అంతర్రాష్ట్ర మహిళా ముఠా అరెస్ట్

● రూ.9లక్షల విలువ గల సొత్తు స్వాధీనం

సైదాబాద్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బస్సుల్లో ప్రయాణికుల దృష్టి మరల్చి వరుస చోరీలకు పాల్పడుతూ తప్పించుకుని తిరుగుతున్న అంతర్రాష్ట్ర మహిళా ముఠాను మాదన్నపేట పోలీసులు అరెస్ట్ చేసి తొమ్మిది తులాల బంగారు నగలు, లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.9లక్షలు ఉంటుందని, తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఈ ముఠాలో ముగ్గురిని అరెస్ట్ చేయగా ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. మీర్‌పేట ఆర్ఎన్‌రెడ్డినగర్‌కు చెందిన వి.సుబ్బలక్ష్మమ్మ(74) గత నెల25న కంచన్‌బాగ్‌లోని ఎస్‌బీఐ నుంచి రూ.10వేల నగదు తీసుకుని ఫిసల్‌బండచౌరస్తాలో బస్సు కోసం వేచి ఉంది. ఇంతలో ముగ్గురు గుర్తుతెలియని మహిళలు మొఖాలకు చున్నీ కప్పుకుని వచ్చి ఎక్కడికి వెళ్లాలని సంభాషణ ప్రారంభించారు. ఇంతలో బస్సు రాగానే మీ బస్సు వచ్చిందని చెప్పి ఆమెతో పాటు ఎక్కారు. కొద్ది దూరం రాగానే ముగ్గురు మహిళలు దిగిపోయారు. తాను వేరె బస్సు ఎక్కానని గ్రహించి సుబ్బలక్ష్మమ్మ మాదన్నపేట ధోబీఘాట్‌చౌరస్తా బస్టాండ్‌లో దిగింది. తన మెడలో 2.6 తులాల బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో అపరిచిత మహిళలు చోరీచేసి ఉంటారని గ్రహించి మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీడీఆర్, సీసీటీవీ టెక్నాలజీ ఉపయోగించుకుని చోరీకి పాల్పడింది తమిళనాడు మహిళా ముఠాగా గుర్తించారు. తమిళనాడు కృష్ణగిరి బంగలూరుకు చెందిన ముస్నియండి రమ్య(27), తిర్పూర్‌కు చెందిన భువనేశ్వర్(30) బిరుదునగర్‌కు చెందిన ముత్తిమర్రి(30)లను పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద తొమ్మిది తులాల బంగారు నగలు, లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలోని మరో ఇద్దరు నిందితులు అంజలి, పార్వతి పరారీలో ఉన్నారు. ఈ ముఠాపై కంచన్‌బాగ్‌లో రెండు, మాదన్నపేట, సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిల్లో కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు. గతంలో పంజాగుట్ట పీఎస్ పరిధిలో రెండు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చారని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ఈ కేసును ఛేదించిన మాదన్నపేట అడిషనల్ ఇన్‌స్పెక్టర్ దాసు, క్రైం ఎస్ఐ వెంకటరమణ, కానిస్టేబుళ్లు సందీప్‌కుమార్, మహేశ్‌కుమార్, షేక్ శర్వాలిలను సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ సుభాష్ పాటిల్, ఏసీపీ వెంకన్ననాయక్‌లు అభినందించారు.

యువకుడిపై గుర్తు తెలియని దుండగులు దాడి

● పోలీసులకు సమాచారం ఇచ్చిన నేతపై దురుసు ప్రవర్తన

● సంఘటన జరిగిన రెండు గంటల తర్వాత వచ్చిన పోలీసులు

సరూర్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లెలగూడలో శుక్రవారం రాత్రి ఓ యువకుడిపై గుర్తు తెలియని దుండగులు దాడిచేశారు. అయితే సదరు దుండగులు ఎవరు.. ఎందుకు దాడి చేశారు? అన్న వివరాలు తెలియరాలేదు. ఆయా వివరాల కోసం దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. కాగా ఈ సంఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చిన ఓ మాజీ ప్రజా ప్రతినిధిపై మీర్‌పేట్ పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇక శుక్రవారం రాత్రి సంఘటన జరిగితే దానికి సంబంధించిన వివరాలు శనివారం రాత్రి 7గంటలకు మీడియాకు రిలీజ్ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. మీర్‌పేట్‌కు చెందిన పెండ్యాల విష్ణు(35) అనే యువకుడు మద్యానికి బానిసై రోడ్లపై తిరుగుతుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సైతం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన విష్ణు.. పది గంటల ప్రాంతంలో జిల్లెలగూడ ప్రధాన రహదారిలోని మాజీ జడ్పీటీసీ జిల్లెల నరేందర్‌రెడ్డి ఇంటి ఎదురుగా రక్తం మడుగులో పడి కనిపించాడు. గుర్తు తెలియని దుండగులు అతడిపై రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్టు తెలుస్తోంది. కాగా స్థానికులు ఈ విషయాన్ని నరేందర్‌రెడ్డికి చెప్పగా, ఆయన అక్కడకు చేరుకుని మీర్‌పేట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయినా పోలీసులు రాకపోవడంతో డయల్ 100కు ఫోన్‌చేశారు. వాళ్లు డయల్ 112కు కాల్ చేయమని చెప్పగా ఆయన ఆ నంబర్‌కు సైతం ఫోన్‌చేశారు. దాంతో పెట్రోలింగ్ వాహనం అక్కడకు వచ్చింది. అప్పటికే తీవ్ర రక్త స్రావం కావడంతో బాధితుడు అపస్మారక స్థితికి చేరుకోవడంతో ఆయన 108కు కాల్ చేసి అంబులెన్స్ రాగానే అందులో ఉస్మానియా ఆస్పత్రికి పంపించారు. ఇదంతా జరిగిన దాదాపు రెండు గంటల తర్వాత మీర్‌పేట్ పోలీసులు నింపాదిగా అక్కడకు చేరుకుని విచారణ పేరుతో బాధితుడి బంధువులను గుచ్చిగుచ్చి ప్రశ్నించడం మొదలుపెట్టారు. దాంతో నరేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. వాళ్లను ఆస్పత్రికి పంపించండి.. ఇక్కడ టైం ఎందుకు వేస్ట్ చేస్తున్నారు.. మీ విచారణ ఉదయం చేసుకోండి అంటూ సూచన చేశారు. అయినా సంఘటన జరిగిన రెండు గంటల తర్వాత వస్తారా.. ఇదేనా మీరు చేసే డ్యూటీ.. ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటారు గానీ విధులపై శ్రద్ధ లేదా? అని ఆయన కాస్త కటువుగా మాట్లాడారు. దాంతో ఓ పోలీసు వెనుక నుంచి వచ్చి నరేందర్‌రెడ్డి కాలర్ పట్టుకుని.. ఏంరా ఎక్కువ మాట్లాడుతున్నావు.. నడువు స్టేషన్‌కు అంటూ పోలీసు వాహనం వైపు బలంగా నెట్టేసినట్టు ఆయన ఆరోపించారు. అదే సమయంలో తన భార్య (జిల్లెలగూడ మాజీ సర్పంచ్ వనితారెడ్డి) అక్కడకు చేరుకుని ఓ మాజీ జడ్పీటీసీతో ఇలాగేనా వ్యవహరించేది అంటూ పోలీసులను అడ్డుకోగా, ఆమె పట్ల సైతం వారు దురుసుగా ప్రవర్తించారని ఆయన పేర్కొన్నారు. సమయానికి రారు.. అడిగితే ఉల్టా తమనే బెదిరించారు.. ఇదేనా ఫ్రెండ్లీ పోలీసింగ్? అని నరేందర్‌రెడ్డి ప్రశ్నించారు. మధ్య రాత్రి వచ్చిన పోలీసులు మద్యం మత్తులో ఉన్నట్టు కనిపించిందని, ఆ సమయంలో డీడీ టెస్ట్ చేస్తే విషయం బయటపడేదని ఆయన వ్యాఖ్యానించారు. కాగా ఈ వ్యవహారంపై మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును ప్రశ్నించగా తమ సిబ్బంది విధులు సక్రమంగానే నిర్వహించారని, నరేందర్‌రెడ్డి ఆరోపణలు అవాస్తవమని కొట్టి పారేశారు.

బాధితుడి పరిస్థితి విషమం

గుర్తు తెలియని దుండగుల దాడిలో గాయపడిన విష్ణు పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఆయన బంధువులు పేర్కొన్నారు. దాడి చేసిన వ్యక్తులు ఎవరు.. ఎందుకు అలా చేశారు అన్నది తేలాల్సి ఉన్నదని వారు చెప్పారు. బాధితుడి సోదరుడు ఈశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

ఔట్‌డోర్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఔట్‌డోర్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. శనివారం ఆయన స్నేహపురికాలనీపార్కులో ఔట్‌డోర్ జిమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అనంతుల సురేందర్‌రెడ్డి, కార్యదర్శి లక్ష్మీకాంతారావు, కోశాధికారి రామారావు, సంయుక్త కార్యదర్శులు కళ్యాణి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.